APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శనివారం 12 సెప్టెంబరు 2026 సంపుటి: 01 సంచిక :108 పేజీలు : 04 వెల: 2-00/-

## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం..
## రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు




స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన షర్మిల

కమిటీలో రుద్రరాజు, పల్లంరాజు, కృపారాణి, తులసిరెడ్డి తదితర నేతలు

గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా మిగతా..2లో

## అసెంబ్లీలో న్యాయం జరగట్లేదు.. అందుకే ఢిల్లీలో ఫిర్యాదు చేశాం: ఎమ్మెల్యే సబిత



అసెంబ్లీ ఎదుట బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేపై దాడి జరిగిందని ఆరోపిస్తూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్ : అసెంబ్లీ ముందు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేపై దాడి జరిగిందని ఆరోపిస్తూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ మెంబర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 'దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అసెంబ్లీ గేటు వద్ద రసాభాస జరిగింది. ఈ సంఘటన కౌరవసభను తలపిస్తోంది. మహిళా ఎమ్మెల్యేల జుట్టుపట్టుకుని లాగారు. పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారు. పోలీసుల గొడవల్లో మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కింద పడిపోయారు. 30ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న మమ్మల్ని అసెంబ్లీ లోపలికి ఎందుకు అనుమతించలేదు. మిగతా..2లో

## డీఎస్సీపై జగన్ విషం కక్కడం బాధాకరం


2

- మాజీ సీఎం జగన్?కు డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలుసా? అని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు.
- వైఎస్సార్సీపీ ఆరోపణలపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన వీడియో విడుదల చేశారు.
- డీఎస్సీపై వైఎస్సార్సీపీ ఆరోపణలపై ఎక్స్ వేదికగా స్పందించిన మంత్రి లోకేశ్

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే.. ఫైళ్ల జాప్యంపై
# సీఎం చంద్రబాబు సీరియస్

- దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- నెలరోజుల్లో ప్రభుత్వ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశం
- సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచన
- క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజా సమస్యలు తెలుసుకోవాలని దిశానిర్దేశం




అమరావతి : ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, మిగతా..2లో

## నేతన్నలకు గుడ్‌న్యూస్.. పెన్షన్ దరఖాస్తుకు తొలగిన కీలక అడ్డంకి..



- ★ ఆంధ్రప్రదేశ్‌లో నేతన్నలకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది.
- ★ నేతన్న భరోసా పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో కీలక నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చింది.

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో నేతన్నలకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నేతన్న భరోసా పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో కీలక నిబంధన నుంచి సీఎం చంద్రబాబు సర్కార్ మినహాయింపు ఇచ్చింది. మిగతా..2లో


## యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ,
## ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోంది

- విద్యా వ్యవస్థలో జరుగుతున్న పేపర్‌లీక్, అధిక ఫీజుల గురించి ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు
- వ్యవస్థను మార్చాలంటే ప్రతి విద్యార్థి స్వరాన్ని వినడం అత్యవసరమన్న ప్రతిపక్షనేత



ఢిల్లీ : భారత విద్యావ్యవస్థపై కాంగ్రెస్? అగ్రనేత రాహుల్? గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. లక్షలాది మంది యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోందని మండిపడ్డారు. వ్యవస్థలోని వైఫల్యాలను ప్రతిరోజూ అనుభవిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల గొంతును వినడం ద్వారానే ఈ వ్యవస్థను బాగు చేయడం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న పేపర్ లీకులు, అధిక ఫీజులు, శిథిలావస్థకు చేరుతున్న మౌలిక సదుపాయాల గురించి శుక్రవారం ఎక్స్? వేదికగా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. "భారత విద్యా వ్యవస్థ ఏ తరాన్ని అయితే మిగతా..2లో

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. ఐటీ, బ్యాంకింగ్ షేర్లతో కొంత ఊరట



2లో..

- 120 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- 79 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లతో సూచీలకు ఊరట
- మెటల్, రియల్టీ రంగాలపై అమ్మకాల ఒత్తిడి
- పెరిగిన ముడి చమురు ధరలు, బాండ్ ఈల్డ్స్

ఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లోకి జారిన సూచీలు

## ప్రధాని మోదీతో రష్యా అధ్యక్షుడు
## పుతిన్ భేటీ- కీలక అంశాలపై చర్చ

- దిల్లీలోని భారత్ మండపంలో ప్రధాని మోదీ
- పుతిన్ భేటీ- రెండు నెలల్లో రెండోసారి



ఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోదీతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్? పుతిన్? శుక్రవారం దిల్లీలో భేటీ అయ్యారు. ఈ ఇరువురు నేతలు గత రెండు నెలల్లో రెండు సార్లు భేటీ కావడం గమనార్హం. భారత్? ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ముందే ఈ ఇరువురు నేతలు భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఇరుదేశాలు 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే, ఇంతకుముందు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్? భారత్?-రష్యా ఆర్థిక, పారిశ్రామిక భాగస్వామ్యాన్ని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని మిగతా..2లో

## సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ ప్రారంభం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు


2

- తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయా తేదీల్లో వివిధ సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా

## ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర.. మహిళా అధికారుల
# ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు

- శాసనసభ సజావుగా జరగకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రలు జరిగాయన్న రేవంత్ రెడ్డి
- ప్రజాప్రతినిధులను, పోలీసులను దూషిస్తూ మూడు రోజులు సభను అడ్డుకున్నారని మండిపాటు
- బీఆర్ఎస్ కుట్రలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంస



హైదరాబాద్: శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఈరోజు నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై మిగతా..2లో

## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే




- వీరప్పన్ మంత్రి అయితే ఎలా ఉంటుందో, రేవంత్ సీఎం కావడం అలాగే ఉందన్న కేటీఆర్
- సీఎం కాకముందు ఆర్టీఐతో బ్లాక్‌మెయిల్ చేసి బతికారని ఆరోపణ
- హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల భూములపై సీఎం కన్ను పడిందన్న మాజీ మంత్రి
- భూదందాల వల్లే రేవంత్ రాజీనామా చేయాల్సి వస్తుందని జోస్యం
- రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్న కేటీఆర్

హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డిపై మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## నేతన్నలకు గుడ్‌న్యూస్.. పెన్షన్ దరఖాస్తుకు తొలగిన కీలక అడ్డంకి..

ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ సమర్పించాల్సిన అవసరం లేదని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. బ్యాంకు స్టేట్‌మెంట్‌కు బదులుగా మాస్టర్ వీవర్ ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాలు అందిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. దీని వల్ల అర్హత ఉన్న నేతన్నలు దరఖాస్తు ప్రక్రియలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ పెన్షన్లు అందిస్తామని మంత్రి సవిత వెల్లడించారు. అర్హత ఉన్న నేతన్నలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. నేతన్నల సంక్షేమం, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. నేతన్నలకు ఆర్థికంగా మేలు జరిగేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని మంత్రి సవిత చెప్పారు.

## రేవంత్ సీఎం అవడం.. వీరప్పన్ మంత్రి అయినట్లే: కేటీఆర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, భూ దందాలు చేసే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కూడా అలాగే ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సెక్షన్ 22ఏ భూ బాధితులతో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ తీరుపై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం కాకముందు రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి బతికేవారని, అలాంటి వ్యక్తి ఇప్పుడు ఏకంగా ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఒక ముఠాను ఏర్పాటు చేసి, వారి కనుసన్నల్లో 22ఏ భూ దందా నడిపిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తెచ్చే ప్రతి స్కీం వెనుక ఒక స్కాం ఉందని, హిల్ట్ పాలసీ, మూసీ రివర్‌ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ పేర్లతో వేల ఎకరాల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి భూదందాలకు తెరలేపారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో ఫాక్స్‌కాన్ వచ్చిన కొంగరకలాన్ భూములపై రేవంత్ కన్ను పడిందని, అక్కడ రూ.వెయ్యి కోట్ల కుంభకోణానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ధరణి పోర్టల్‌లో వేలిముద్ర లేకుండా ఇంచు భూమి కూడా మార్చలేరని, కానీ ఇప్పుడు భూభారతితో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరుగుతోందని విమర్శించారు. భూములను కాపాడాల్సిన కాపలాదారులే కబ్జాదారులుగా మారారని అన్నారు. దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో భూదోపిడీ జరుగుతోందని, ఈ వ్యవహారాలతో రేవంత్ రెడ్డి త్వరలోనే రాజీనామా చేయాల్సి వస్తుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. మరో రెండేళ్లలో కేసీఆర్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ప్రధాని మోదీతో రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ- కీలక అంశాలపై చర్చ

సాధించే దిశగా ఇరుదేశాల వ్యాపార వర్గాలు, సంస్థలు కృషి చేయాలని ఆయన కోరారు. ఢిల్లీలో రష్యా పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి అంటోన్? అలిఖనోవ్?తో కలిసి 'ఇన్నోప్రోమ్ ఇండియా 2026' కో-ఛైర్ ప్లీనరీ సెషన్?లో గోయల్ మాట్లాడారు. ప్రస్తుతం సుమారు 60 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు పెంచాలంటే, రానున్న నాలుగేళ్లలో మరో 40 బిలియన్? డాలర్లను జోడించాల్సి ఉంటుందని అన్నారు. అలాగే వార్షిక వృద్ధిరేటు రెండంకెల స్థాయిలో కొనసాగించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

### ఇదే ప్రధాన ఎజెండా!

భారతదేశంలో 'ఇన్నోప్రోమ్' సాధించిన విజయం కూడా మోదీ, పుతిన్ ద్వైపాక్షిక చర్చల ఎజెండాలో ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అలాగే ఇంధన సరఫరా (ఫ్యూయెల్ సైకిల్?), లైఫ్ సైకిల్? సపోర్టుతో సహా పౌర అణు సహకారాన్ని బలోపేతం చేయడం కూడా ఇరువురు నేతలు చర్చించనున్నారు. అలాగే మొబిలిటీ రంగంలో సహకారాన్ని పెంపొందించడం, రష్యాకు భారతకు చెందిన నైపుణ్యం గల కార్మికుల వలసలు పెంచడం, వ్యూహాత్మక ఖనిజాల రంగంలో భాగస్వామ్యం పెంపొందించడంపై ఇరువురు నేతలు దృష్టిసారించే అవకాశం ఉంది. అలాగే జాయింట్ వెంచర్? ప్రాజెక్టుల ద్వారా ఎరువుల సరఫరాలో సహకారం మరింత పెంచడంపై కూడా వారు చర్చించనున్నారని తెలుస్తోంది.

## యువత నిజాయతీగా కష్టపడుతున్నప్పటికీ, ఈ వ్యవస్థ వారిని నిరాశపరుస్తోంది

ఉన్నత స్థాయికి తీసుకురావాలో అనుకుంటుందో, అదే తరాన్ని విఫలం చేస్తోంది. అయితే, ప్రతిరోజూ దాని వైఫల్యాలను అనుభవిస్తున్న వారి మాటలు వినడం వల్లే ఆ సమస్యను సరిదిద్దడం సాధ్యమవుతుంది. కాబట్టి, విద్యా వ్యవస్థపై మీరు ఎందుకు ఆశ కోల్పోయారు? విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మీ అనుభవాలను నాతో పంచుకోండి."

### రాహుల్? గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

విద్యావ్యవస్థలో లోపాలకు సంబంధించిన అనుభవాలను తనతో పంచుకోవాలని రాహుల్? ఒక ఆన్‌లైన్ లింక్‌ను షేర్ చేశారు. అందరం కలిసి మళ్లీ ఆశలను చిగురింపజేద్దామని ఆయన పిలుపునిచ్చారు. కాగా, విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి నిర్వహించనున్న ఛాత్రోం కీ గూంజ్? కార్యక్రమాన్ని ఈ నెల 19న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనుంది. వ్యవస్థను మార్చాలంటే ప్రతి విద్యార్థి స్వరాన్ని వినడం అత్యవసరమని ఆయన నొక్కి చెప్పారు. గాంధీ కోటా, డేహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్, పుణెలో నాలుగు సమావేశాలను నిర్వహించారు. ఆగస్టు 22న పుణెలో జరిగిన చివరి కార్యక్రమం ప్రత్యేకంగా విద్యార్థినుల కోసం నిర్వహించారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. ఐటీ, బ్యాంకింగ్ షేర్లతో కొంత ఊరట

చివర్లో కొంత కోలుకున్నాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను కనిష్ఠాల నుంచి కొంత వరకు గట్టెక్కించాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల పరిస్థితులు దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 120.83 పాయింట్లు నష్టపోయి 74,781.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 79.70 పాయింట్లు తగ్గి 23,398.10 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హిండాల్కో ఇండస్ట్రీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్ షేర్లు లాభాల్లో ముందున్నాయి. మరోవైపు పలు కీలక రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.26 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.58 శాతం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే మెటల్, రియల్టీ సూచీలు ఎక్కువగా నష్టపోయాయి. ప్రైవేట్ బ్యాంక్, ఐటీ సూచీలు మాత్రం లాభాల్లో కొనసాగి ప్రధాన సూచీలకు కొంత అండగా నిలిచాయి. ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్లలో ఒడుదొడుకులను పెంచే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే దేశీయ ఆర్థిక పరిస్థితులు బలంగా ఉండటం, సంస్థాగత పెట్టుబడులు కొనసాగుతుండటం వల్ల దిగువ స్థాయుల్లో కొనుగోళ్లు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అమెరికాలో ఉత్పత్తిదారుల ద్రవ్యోల్బణం పెరగడం, ఆర్థిక గణాంకాలు బలంగా ఉండటంతో వడ్డీ రేట్ల విషయంలో కఠిన వైఖరి కొనసాగొచ్చన్న అంచనాలు పెరిగాయి. దీంతో బాండ్ ఈల్డ్స్ పెరిగి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు మరింత ఊతమిచ్చాయి.

## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం.. రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు



ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన 'రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ'ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ ర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

# పాలనలో స్పీడ్ పెరగాల్సిందే.. ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

మొదటి పేజీ తరువాయి




గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు.

### నెల రోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే..

ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.

### క్షేత్రస్థాయి పర్యటనలతో సమస్యల పరిష్కారం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు. సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.

### గ్రామ, వార్డు సిబ్బందికి జాబ్ ఛార్ట్

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

# డీఎస్సీపై జగన్ విషం కక్కడం బాధాకరం: మంత్రి లోకేశ్

మొదటి పేజీ తరువాయి

అమరావతి : మాజీ సీఎం జగన్?కు డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలుసా? అని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు. డీఎస్సీ ప్రక్రియపై జగన్ విషం కక్కడం చాలా బాధాకరమని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ ఆరోపణలపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన వీడియో విడుదల చేశారు. కోర్టు చివాట్లు పెట్టినా జగన్‌లో మార్పు రాలేదన్నారు. ఉపాధ్యాయులను బెదిరించే ధోరణిలో మాట్లాడటం సరికాదని, వారి జోలికొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యువగళం పాదయాత్రలో నిరుద్యోగ యువత కష్టాలు చూశానన్న లోకేశ్, ఏటా 3 వేల డీఎస్సీ పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఐదేళ్లలో సుమారు 30 వేల టీచర్లు భర్తీ చేస్తామని తెల్చి చెప్పారు. "వైఎస్సార్సీపీ ఐదేళ్ల పాలనలో భర్తీ చేసిన టీచర్ పోస్టులు సున్నా. చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీపైనే. 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు సుమారు 300 కేసులు వేశారు. 300 కేసుల్లోనూ ప్రభుత్వాన్ని కోర్టులు తప్పుపట్టలేదు. డీఎస్సీపై ప్రతి ఆరోపణకు అధికారులు ఆధారాలతో సమాధానం ఇచ్చారు. టీచర్లపై ఒత్తిళ్లు, దాడులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును 53 రోజులు జైలులో పెట్టారు. మూడేళ్లుగా సాగిన లీగల్ ప్రాసెస్ పూర్తయింది. చంద్రబాబుకు క్లీన్‌చిట్ వచ్చింది. త్వరలోనే కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తాం" - లోకేశ్, మంత్రి జగన్ చెప్పిన అసత్యాలే మళ్లీ మళ్లీ చెబుతున్నారు: చెప్పిన అబద్ధాలనే జగన్ మళ్లీ మళ్లీ చెబుతున్నారని శాప్ ఛైర్మన్ రవినాయుడు మండిపడ్డారు. డీఎస్సీపై ఉన్నతాధికారులు చెప్పినా జగన్‌కు అర్థం కావడం లేదన్నారు. డీఎస్సీ నియామకాల్లో తమకు అన్యాయం జరిగిందని ఏ ఒక్క అభ్యర్థి ఎవరూ ఫిర్యాదు చేయలేదని, కేవలం తన సొంత మీడియా సాయంతో బాధితులను సృష్టిస్తున్నారని ఆరోపించారు. క్రీడాకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తెచ్చిందని రవినాయుడు గుర్తు చేశారు. అందులో భాగంగా మెరిట్ సాధించిన క్రీడాకారులకు ఎలాంటి పరీక్ష లేకుండానే ఉద్యోగాలు కల్పించేలా జీవో 4 తీసుకొచ్చామన్నారు. ఈ విధానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు గానీ, జీవో జారీ చేసినప్పుడు గానీ జగన్ ఎందుకు మాట్లాడలేదు? అని ప్రశ్నించారు. డీఎస్సీని అడ్డుకోవడానికి జగన్ కుట్ర చేస్తూ 16 వేల మంది నిరుద్యోగ ఉపాధ్యాయుల భవిష్యత్తుతో రాజకీయ చెలగాటం ఆడుతున్నారని రవినాయుడు ధ్వజమెత్తారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలన్నదే జగన్ లక్ష్యమని విమర్శించారు. నాలుగు నెలలుగా చెబుతున్న అవే ఆరోపణలను మళ్లీ రెండు గంటల



ప్రెస్‌మీట్‌లో వల్లె వేశారని అధికారులు, విద్యాశాఖ మంత్రి ఇప్పటికే ఆధారాలతో వాస్తవాలను వెల్లడించినా కావాలనే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ హయాంలో స్పోర్ట్స్ కోటాలో ఇచ్చిన ఉద్యోగాలు, వాటికి సంబంధించిన సర్టిఫికెట్లు, రికార్డులపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీ, గ్రూప్-1 వ్యవహారాలను డీఎస్సీకి ముడిపెట్టి నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.

# ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర.. మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. బీఆర్ఎస్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాజకీయంగా ఎదిగిన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి లాంటి నాయకులు ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేయాలని చూడటం దారుణమని సీఎం అన్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు. పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి,



సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు. చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

# సెప్టెంబర్ 17 నుంచి సేవా సంకల్ప్ అభియాన్ ప్రారంభం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

మొదటి పేజీ తరువాయి

ప్రస్థానాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని రాంచందర్‌రావు చెప్పారు. ఈ మేరకు సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ప్రయోజనాలను నేరుగా అందిస్తున్నామని ఆయన వివరించారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విస్తరణతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో కీలక స్థానాన్ని సాధించిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని రాంచందర్‌రావు తెలిపారు. ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. అభియాన్‌లో భాగంగా మేరే సప్నో కా భారత్, సేవా కీ కహానీ, సేవా జ్యోతి కలశ్ యాత్ర, సుశాసన్ సేవా సంవాద్ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. సేవ,



సుశాసనం, ప్రజా సంక్షేమం అనే స్ఫూర్తితో మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యమని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# అసెంబ్లీలో న్యాయం జరగట్లేదు.. అందుకే ఢిల్లీలో ఫిర్యాదు చేశాం: ఎమ్మెల్యే సబిత

మొదటి పేజీ తరువాయి

కనీసం మహిళా ఎమ్మెల్యేలనైనా అనుమతించమని అడిగితే పోలీసులు వినిపించుకోలేదు. ముఖ్యమంత్రే మాపై దాడికి ఆదేశాలు జారీచేశారని నేను నమ్ముతున్నాను' అని సబిత పేర్కొన్నారు. 'అసెంబ్లీ సమావేశంలో అయినా మాపై జరిగిన దాడి గురించి చర్చ జరుపుతారనుకున్నాం. సీఎం రేవంత్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల మంత్రి, డీజీపీ ఈ సంఘటన గురించి మాట్లాడుతారని అనుకున్నాం. కానీ ఎవరూ నోరు మెదపలేదు. మాపై దాడిచేసి, మాపైనే కేసులు పెట్టారు. ఎమ్మెల్యేలు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులు చేశారు. స్పీకర్‌ను మా ఎమ్మెల్సీ ఏమో అన్నారని ఆరోపించారు. కేసీఆర్ ఇంటిపైకి చావుడప్పు కొట్టమని మనుషుల్ని పంపారు. ఇవన్నీ సీఎం



డైరెక్షన్‌లోనే నడిచాయి. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడులకు కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. మాకు జరిగిన అవమానాన్ని సభలో చెప్పుకునేందుకూ అవకాశమివ్వలేదు. మాకు అసెంబ్లీలో న్యాయం జరగలేదు.. అందుకే ఢిల్లీకి వచ్చాం. ఇది ముఖ్యమంత్రి సిగ్గుపడాల్సిన విషయం' అని సబిత మండిపడ్డారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సబిత అన్నారు. ఇంతవరకూ హామీలను నెరవేర్చలేదని ఎమ్మెల్యే విమర్శించారు. 22ఏ కింద కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టి కాంగ్రెస్ భూదందాకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై అసెంబ్లీ సాక్షిగా దాడులు చేశారని ధ్వజమెత్తారు. మహిళా కానిస్టేబుళ్లను ముందుపెట్టి శిఖండి రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని సోనియా, రాహుల్ దృష్టికి తీసుకెళ్తామని, వారికి లేఖలు కూడా రాస్తున్నామని ఎమ్మెల్యే సబిత తెలిపారు.

# బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై స్పందించిన మంత్రి శ్రీధర్

**బాబు - బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం - తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్న**

హైదరాబాద్ : బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఎన్నడు ఇలాంటి ఘటనలు జరగలేదన్న మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించిందని తెలిపారు. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారని, ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారని ఆరోపించారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించిందని, పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనబడుతోందని వెల్లడించారు. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని తామెప్పుడూ అనుకోలేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది : బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉందన్న మంత్రి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించిందని, టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదని నిబంధన ఉందని గుర్తు చేశారు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్ సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయని మండిపడ్డారు. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. రాహుల్‌కు ఒక న్యాయం, మాకో న్యాయమా అంటూ కేటీఆర్ అంటున్నారని, రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకొని లోక్‌సభకు వెళ్లలేదని తెలిపారు. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే తాము తీసుకెళ్లలేదని గుర్తు చేశారు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారని, ఏవైనా లోటుపాట్లు జరిగితే ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎందుకు ఖండించదు : స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదని హితవు పలికారు. తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని, కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయని తెలిపారు. తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించదని ప్రశ్నించారు. క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు : స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం మంత్రి మండిపడ్డారు. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంటుందని, తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారని, శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారని, మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపిందని విమర్శించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తి లేదని స్పషం చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు ఉంటాయని, తప్పు జరిగిందని ఒప్పుకునే మనస్సు ఉండాలని వెల్లడించారు. "ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనపడింది. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని మేము ఎప్పుడూ అనుకోలేదు. పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తే లేదు

## కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ

అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : ఈడిగ/గౌడ సంఘం, ఎక్సైజ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 94 మంది కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షులు సురేంద్ర కుమార్ గౌడ్, టీసీఎస్ అధ్యక్షులు రఘురామయ్య గౌడ్ హాజరు కాగా, ఎక్సైజ్ శాఖ ఈసీ రామ్మోహన్‌రెడ్డి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సురేంద్ర కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కల్లు వృత్తి చేస్తున్న ఈడిగ/గీత కార్మికులకు 50 ఏళ్ల పెన్షన్ పొందడానికి ఈ గుర్తింపు కార్డులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కావున అనంతపురం జిల్లాలోని అర్హత కలిగిన కల్లు గీత కార్మికులు వెంటనే ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులను సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వరూప్ బాబు గౌడ్, రామ్మోహన్ గౌడ్ (సోమల దొడ్డి), మల్లికార్జున గౌడ్, శివానంద గౌడ్, నారాయణ స్వామి గౌడ్, రమేష్ గౌడ్, భాస్కర్ గౌడ్, చంద్రరాయుడు గౌడ్, లాలెప్ప గౌడ్, శ్రీశైలం శంకర్ గౌడ్, రమణ గౌడ్, శ్రీనివాస్ బాబు, మురళి గౌడ్, మధు గౌడ్, మురళీమోహన్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, ఈడిగ/గౌడ సంఘం నాయకులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, కల్లు గీత కార్మికులు పాల్గొన్నారు.



## ఆత్మీయులను కోల్పోయిన వేదనకు.. నష్టపరిహారమే ఆర్థిక ప్రాణవాయువు

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 11 అనంత సూర్య : వాహన ప్రమాదాల్లో బాధితులకు త్వరితగతిన ఇన్సూరెన్స్ నష్టపరిహారం అందడమే వారికి జరిగే సరైన న్యాయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న ప్రమాదాల్లో బాధితులకు పరిహారం అందడంలో తీవ్ర ఆలస్యం జరుగుతోందని, కుటుంబంలో విలువైన వ్యక్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారికి తక్షణ ఆర్థిక ఊరట ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, ఏజెంట్లు మానవీయ కోణంలో స్పందించి పరిహారం త్వరగా అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు, అనంతపురం అర్బన్ డిఎస్పీ ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వివిధ ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, ఏజెంట్లతో స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు ఇన్సూరెన్స్ పరిహారం అందేలా పోలీస్ శాఖ తరఫున ఒక వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టామన్నారు. బాధితులకు పోలీస్ శాఖ నేరుగా అందుబాటులో ఉంటూ అండగా నిలిచే తొలి ప్రయత్నం ఇదని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇన్సూరెన్స్ క్లెయిమ్ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పోలీస్ డాక్యుమెంటేషన్‌తో సహా అన్ని రకాల తగు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. సమావేశంలో డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ వలి బాషా, ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు




## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

అనంతపురం క్రైం ప్రతినిధి, సెప్టెంబర్ 11 అనంత సూర్య : ప్రజల భద్రతే లక్ష్యంగా బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు, నీలారెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులకు విశేష స్పందన లభించింది. బుక్కరాయసముద్రం ఎస్సైఆంజనేయులు నాయకత్వంలో 'ఈగల' బృందం, గ్రామ మహిళా పోలీసులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'సైబర్ సురక్ష వాహనం' ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మోసాలు, ఆన్‌లైన్ నేరాలపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో సమావేశమై పలు సామాజిక అంశాలు, చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సైబర్ ఆర్థిక నేరానికైనా గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి నగదు కాపాడుకోవాలన్నారు. మహిళలు, యువతుల రక్షణకు 'శక్తి యాప' ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర సమయాల్లో 'డయల్ 100' సేవలను వినియోగించుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు లేదా రవాణాపై సమాచారం ఉంటే 'ఈగల' ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ 1972కు కాల్ చేసి పోలీసులకు సహకరించాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరం అన్నారు. మైనర్ల ప్రేమ వ్యవహారాలు/పారిపోవడం, గొలుసు దొంగతనాలు వంటి నేరాల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా వినియోగంలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో సైబర్ సురక్ష వాహన సిబ్బంది, ఈగల్ టీం, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీచైతన్య 9వ బ్రాంచులో ఘనంగా హిందీ దివస్, వినాయక చవితి వేడుకలు

అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : స్థానిక శ్రీ చైతన్య స్కూల్ ఏటీపీ 9వ బ్రాంచ్ పాఠశాలలో ముందస్తుగా హిందీ దివస్, వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏజీఎం సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందీ భాష దేశాన్ని ఏకతాటిపై నడిపే అనుసంధాన భాష అని, విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించడం ద్వారా జాతీయ స్థాయిలో రాణించవచ్చని తెలిపారు. అనంతరం వినాయక చవితి వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఏకదంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టి గణపతులను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులచే హిందీ కవితా గానం, ప్రసంగ పోటీలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ ప్రిన్సిపాల్ శాంత, జోనల్ కోఆర్డినేటర్ తిరుమలేష్ రెడ్డి, ప్రైమరీ జోనల్ కోఆర్డినేటర్ పూజ, ఇంచార్జ్ దీప, బాటూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పింఛన్ దరఖాస్తుకు 16వ తేది వరకు మాత్రమే గడువు

అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 16వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని.. పార్టీ నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకుని అర్హులైన వారితో దరఖాస్తు చేయించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. ఇదే అంశంపై ఆమె అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. కొత్త పింఛన్ల అంశంపై వారికి ఎమ్మెల్యే సునీత పలు సూచనలు చేశారు. మనం ఎక్కడికి వెళ్లినా.. ఏ సమావేశం జరిగినా.. ఎక్కువ మంది పింఛన్లు అడిగే వారని గత వైసీపీ ప్రభుత్వంలో కొందరి పెన్షన్లను అన్యాయంగా తొలగించారన్నారు. ఈ విషయాన్ని తాము సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అసెంబ్లీలో కూడా చాలా సార్లు ప్రస్తావించామన్నారు. ఇప్పుడు 3లక్షల పింఛన్లు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే కొత్తగా వచ్చే పింఛన్లు అర్హులకు మాత్రమే అందేలా చూడాలన్నారు. ఇందులో పార్టీలు చూడకుండా అర్హులైన వారి చేత దరఖాస్తు చేయించాలన్నారు. సమయం తక్కువ ఉన్నందుకు పార్టీ శ్రేణులు చొరవ తీసుకోవాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీ శ్రేణుల ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని.. సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునేలా సహాయం చేయాలన్నారు. కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు, నాయకులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. అర్హతకు అవసరమైన పత్రాలు లేదా ఏమైనా సందేహాలుంటే సచివాలయం లేక ఎంపీడీఓను సంప్రదించి స్పష్టత పొందాలని సూచించారు. ఇప్పటికే ఎసఐఆర్ తో పాటు ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కర్నీ ఆమె అభినందించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొనే ఏ సమస్య మీద అయినా తాము ఉన్నత స్థాయి వరకు తీసుకెళ్తున్నట్టు చెప్పారు. హౌస్ మ్యాపింగ్ అంశాన్ని కూడా అసెంబ్లీలో ప్రస్తావించామని.. త్వరలోనే అది కూడా వస్తే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మరోవైపు ఈనెల 22వ తేదీన నారా లోకేష్ రాప్తాడు పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు. చెన్నేకొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా పాఠశాల అదనపు భవనాలను ప్రారంభిస్తారన్నారు. అలాగే రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను ప్రారంభించి సభలో పాల్గొంటారన్నారు. అనంతరం కార్యకర్తల సమావేశం నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.



# వడ్డెర్ల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహిద్దాం

### - 22న అనంతపురంలో వడ్డెర్ల ఆత్మీయ సమ్మేళనం

అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : నగరంలోని రంగస్వామి నగర్‌లో వడ్డెర్ల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీన అనంతపురంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో వడ్డెర్ల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, వడ్డెర నాయకులు పెద్ద ఎత్తున హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని వడ్డెర్ల కుల బాంధవులు, జిల్లా నలుమూలల నుంచి వడ్డెర్లు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వడ్డెర్లకు ఎమ్మెల్సీ పదవి దక్కడం దాదాపు 40 ఏళ్ల కల నెరవేరిన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేయాలని నాయకులు అన్నారు. అలాగే ఎన్నికైన ఎమ్మెల్సీ దలవాయి రమాదేవికి ఘనంగా సన్మానం నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డెర్ల ఐక్యతను చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ ఈ సమావేశంలో పాల్గొనాలని, భవిష్యత్తులో వడ్డెర్ల సత్తా ఏమిటో చాటిచెప్పే విధంగా భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. వడ్డెర్ల అభ్యున్నతికి కృషి చేస్తున్న వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ.. రానున్న రోజుల్లో కూడా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మల్లెల జయరాం, సంజీవరాయుడు, పెద్ద మారెప్ప, దలవాయి వెంకటనారాయణ, కుంచపు వడ్డే వెంకటేశులు, గోపాలకృష్ణ, రామకృష్ణ, మంజుల నారాయణ, వెంకటయ్య, కదిరప్పతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వడ్డెర్ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రతి వడ్డెర కుటుంబం ఆత్మీయ సమావేశానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



# స్థానిక ఎన్నికల సన్నద్ధతపై ఎమ్మెల్యే దగ్గుపాటి సమీక్ష

అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : అనంతపురం అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ దేవేంద్రప్ప పాల్గొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. ప్రతి క్లస్టర్, యూనిట్ స్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నాయకులకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలతో నిరంతరం మమేకమై, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, జిల్లా కార్యదర్శి కోనంకి గంగారామ్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి, క్లస్టర్, యూనిట్ ఇంచార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.



# తప్పు చేసిన టీచర్‌కు వత్తాసు పలుకుతున్న డీఈఓ తీరు సరికాదు

### - విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరిన విద్యార్థి నాయకులపై డీఈఓ అనుచిత ప్రవర్తన

అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : కళ్యాణదుర్గం పట్టణంలో ఉన్న నార్త్ జడ్పీ హైస్కూల్లో విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన తెలుగు ఉపాధ్యాయులు శ్రీరామచంద్రనాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఎసఎఫఐ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ఎసఎఫఐ విద్యార్థి సంఘంపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఎసఎఫఐ నాయకులు తప్పుపట్టారు. ఈ సందర్భంగా ఎసఎఫఐ జిల్లా కార్యదర్శి పరమేష్, జిల్లా అధ్యక్షులు తరిమెలగిరి మాట్లాడుతూ.. గత నెల రోజులుగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థినుల మీద లైంగిక దాడులకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కువయ్యాయన్నారు. వీటి మీద చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించడానికి వెళితే.. మీరు తెచ్చే సమస్యలే ఎక్కువ అయ్యాయని, రెండు మూడు రోజుల నుండి మీరు ఇలాంటి సమస్యలే వెలుగు తీస్తున్నారని, ఇలాంటివి తీసుకురావద్దని అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. నిన్న ట్రెల్లిస్ స్కూల్ యాజమాన్యం, నేడు కళ్యాణదుర్గం ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో వరుసగా.. ఇలా జరుగుతునాయన్నారు. ప్రస్తుతం కళ్యాణదుర్గం జడ్పీ హైస్కూల్లో పనిచేస్తున్న శ్రీరామచంద్ర నాయక్‌పై గతంలో కూడా అనేక రకాల లైంగిక ఆరోపణలు వచ్చాయన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారిగా కఠినంగా ప్రవర్తించి, వారి మీద శాఖా పరమైన చర్యలతో పాటు ఉద్యోగం నుంచి తొలగిస్తే మరొకసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ఉంటాయని చెప్పడంతో, మీరు నాకెందుకు చెప్పేది మేము విచారణ చేసి నివేదిక ఇస్తామని, మా పరిధిలో లేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కనీసం వినతి పత్రం తీసుకోవడానికి కూడా ముఖం చాటేసారని, తప్పు చేసిన ఉపాధ్యాయునికి కొమ్ముకాస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎసఎఫఐ నాయకులు వంశీ, సాయి, మోహన్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్ వివేకా హత్య కేసులో వారికి శిక్ష తప్పదు



అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో త్వరలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయని.. ఈ హత్యకు 40 కోట్లు డీల్ కుదిరిందని దస్తగిరే చెప్పాడని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన 58వ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ దేవేంద్రప్పతో కలిసి ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రజలు అర్జీలు ఇచ్చి తమ సమస్యలు చెప్పుకున్నారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 58 సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి 1325అర్జీలు స్వీకరించామన్నారు. ఇందులో 1286 సమస్యలకు పరిష్కారం చూపించామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జగన్ పేరు చెబితే విధ్వంసం, వినాశనం గుర్తుకొస్తాయని.. చంద్రబాబు పేరు చెబితే అభివృద్ధి, విజన్ గుర్తుకొస్తుందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందని.. 10లక్షల కోట్ల అప్పులు పెట్టి పోయారన్నారు. ఏ శాఖలో చూసినా ఖాళీ చేసిన ఖజానానే కనిపిస్తోందన్నారు. అయినా సరే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. వైసీపీ నాయకులు గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్ట్ భర్తీ చేయకుండా.. ఇప్పుడు మెగా డీఎస్సీపై విమర్శలు చేస్తున్నారన్నారు. వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టు కేసులు దాటుకుని 150 రోజుల్లో 16347ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 పోస్టుల భర్తీలో అక్రమాలకు పాల్పడి 190మందిని ఇరాకాటంలో పెట్టారన్నారు. ఇక వైసీపీ హయాంలో జరిగిన 3500 కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో ఆ పార్టీ నాయకులంతా ఇరుక్కున్నారన్నారు. కూటమి వచ్చాక అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించి మద్యం షాపులు కేటాయించామన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసింది ఎవరంటే రాష్ట్రంలో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారని.. దస్తగిరి కూడా ఈ కేసులో సంచలన విషయాలు చెప్పాడన్నారు. గొడ్డలి పార్టీ నాయకులు ఈకేసు నుంచి తప్పించుకోలేరని.. వారికి శిక్ష తప్పదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. మరోవైపు అర్బన్ నియోజకవర్గంలో 1300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశామన్నారు. ఈరోజు నగరంలో ఏ వీధిలో చూసినా కొత్త రోడ్లు, డ్రైనేజీలు కనిపిస్తున్నాయన్నారు. అంతే కాకుండా 30ఏళ్లుగా ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపిస్తున్నామన్నారు. త్వరలోనే ఇక్కడ చెత్తను క్లియర్ చేసి ఫ్రెష్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తీసుకొస్తామని.. మిగిలిన స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

- పింఛన్ల దరఖాస్తు అంశంపై పార్టీ నేతలతో సమావేశం
- కార్యక్రమంలో పాల్గొన్న అబ్జర్వర్ దేవేంద్రప్ప, కీలక నాయకులు
- స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా చర్చ
- వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానంలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్న ఎమ్మెల్యే
- పార్టీ కన్నతల్లిలాంటిదన్న అబ్జర్వర్ దేవేంద్రప్ప



# సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

**అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య :**

తెలుగుదేశం పార్టీ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టిడిపి నాయకులకు సూచించారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అంశంపై పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అబ్జర్వర్ దేవేంద్రప్పతో పాటు క్లస్టర్, డివిజన్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఉన్న నాయకులు ఎలా వ్యవహరించాలన్న దానిపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు అబ్జర్వర్ దేవేంద్రప్ప సూచనలు చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల గురించి కూడా ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఎంతో ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ కూడా మరో మూడు లక్షల పింఛన్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. ఇందుకోసం ప్రజలు దరఖాస్తు చేసుకునేందుకు 16వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి నాయకుడు ప్రజలకు వివరించి.. అర్హులైన వారిని దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఇందులో ఎక్కడా పార్టీలు చూడవద్దని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. గతంలో పార్టీలు చూసి పింఛన్లు ఇచ్చారని, అలాంటి పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. మన పార్టీ అయినా, కాకపోయినా, ఎవరైనా సరే అర్హత ఉంటే పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. మనం అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేపట్టిన ముందు వరుసలో ఉన్నామన్నారు.

గతంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేశామ న్నారు. అలాగే ఇంటింటికి కుటుంబ ప్రభుత్వం కార్యక్రమంలో ఇప్పటికే రాష్ట్రంలో 5వ స్థానం లో ఉన్నామని, అనంతపురం జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నట్లు చెప్పారు. దాదాపు 95 శాతం పూర్తి చేశామని.. మిగిలిన ఐదు శాతా న్ని కూడా త్వరలోనే పూర్తి చేయాలన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 10వ తేదీన ఇదే అనంత పురం వేదికగా సూపర్ సిక్స్- సూపర్ హిట్ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో విజయవంతం చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పాటు 120 మంది ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేపట్టిన అది విజయవంతంగా పూర్తి చేస్తున్నామంటే.. పూర్తిగా మీ సహకారం వల్లేనన్నారు. అయితే ఇప్పుడు మనం పింఛన్లకు దరఖాస్తు చేయించుకునే కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేయాలని సూచించారు. స్థానిక సంస్థలు ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రతి నాయకుడు, కార్యకర్త మరో 2 నెలల పాటు దీనిపైన సీరియస్‌గా పని చేయాలన్నారు. పూర్తి స్థాయిలో ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో చొరవ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లు 62 స్థానాలకు పెరిగే పెరుగుతాయని.. ఇక్కడ టికెట్లు ఆశిస్తున్న వారు అలాగే పార్టీలో కీలకంగా ఉన్న వారంతా అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. పార్టీలో ఏదైనా సమస్య ఉంటే మీరు నాతో గొడవపడి సాధించుకోవచ్చన్నారు. కానీ పార్టీలో ఉంటూ కోవర్టులుగా వ్యవహరించి అవతల వారికి మేలు చేసే చీకటి రాజకీయాలు చేస్తే.. మాత్రం ఖచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు.

ఇలాంటి విషయాల్లో మంత్రి నారా లోకేష్ చాలా సీరియస్‌గా ఉంటారని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎలాంటి అనుమానాలు ఉన్నా.. కోఆర్డినేటర్‌గా నియమితులైన బుగ్గయ్య చౌదరి వద్దకు వచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. పార్టీలో కష్టపడ్డ వారికి కచ్చితంగా పదవులు ఉంటాయని, ఎవరైనా సరే పార్టీకి విధేయులుగా పని చేయాలన్నారు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన నన్ని ఎంపీటీసీగా చేసిన లేదా ఎమ్మెల్యేగా చేసిన అది పార్టీకి విధేయుడుగా ఉండటం వల్లనేనని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.

అబ్జర్వర్ దేవేంద్రప్ప మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అంటే కన్నతల్లి లాంటిదని, తల్లిని నమ్ముకున్న వారు ఎవరు నష్టపోరని ఆయన స్పష్టం చేశారు. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి తాను వచ్చానని, గతంలో ఎన్నో స్థానిక సంస్థలు ఎన్నికల్లో విజయం సాధించానన్నారు. అందుకే తనను గుర్తింపునించి ఒక కార్పొరేషన్‌కి చైర్మన్‌గా చేశారన్నారు. పార్టీ ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోందని.. ఇవన్నీ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తోందని, ఆయన కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని దేవేంద్రప్ప పేర్కొన్నారు.

# ఏపీఎస్ జెడ్‌జీఎఫ్ఈఏ నూతన అడహాక్ కమిటీ నియామకం

## - రాష్ట్ర కన్వీనర్‌గా కటిక జయరాం



అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : స్థానిక ఎన్‌జీవో హోమ్ లో శుక్రవారం ఏపీఎస్ జెడ్‌జీఎఫ్ఈఏ 31/17 రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దు చేసి.. నూతన అడహాక్ కమిటీని ఎంపిక చేశారు. అనంతరం సంస్థ నిర్వహణ బాధ్యతల నిమిత్తం నూతనంగా అడ్హాక్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రాష్ట్ర కన్వీనర్‌గా కటిక జయరాం, రాష్ట్ర కో-కన్వీనర్‌గా పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జీ సంయుక్తంగా అధికారికంగా వెల్లడించారు. నూతనంగా ఎంపికైన నాయకత్వంలో సంస్థ బలోపేతానికి, ఆశయ సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

# ట్రెల్లీస్‌లో... పిల్లల భద్రత ఎక్కడ ?



అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థుల భద్రతపై ఏమాత్రం లేని ట్రెల్లీస్ విద్యాసంస్థపై చర్యలు తీసుకుని, పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కేశవ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ట్రెల్లీస్ స్కూలులో విద్యార్థుల ఫీజులు రూ.లక్షల్లో ఉన్నాయన్నారు. ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ, భద్రత కల్పించడంలోనూ ఏమాత్రం లేదన్నారు. బాలిక ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. గతంలో కూడా ఇద్దరు విద్యార్థులు గొడవ పడిన విషయంలో ఓ విద్యార్థి కంటికి తీవ్ర గాయమైందన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీని సైతం కలిసి ఫిర్యాదు చేసిన సంఘటన జరిగిందన్నారు. అంతేకాకుండా ఈ విద్యాసంస్థపై అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇవన్నీ పరిగణలోకి తీసుకుని జిల్లా విద్యాశాఖ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టి ట్రెల్లీస్ విద్యాసంస్థ గుర్తింపు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన నాయకులు కురుకుంట మనోజ్, నాయకులు భరత్, దాము, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సార్ బాలికల క్యాంపస్‌లో ప్రెషర్స్ డే వేడుకలు

## ప్రిన్సిపల్ భవాని ఆధ్వర్యంలో అద్భుత ఫలితాలు సాధిస్తోంది

## జోనల్ ఇన్చార్జ్ శివకుమార్







**అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య :**

నగరంలోని గుత్తి రోడ్డులోని ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల క్యాంపస్‌లో ఘనంగా ప్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం జోనల్ ఇన్చార్జ్ ఎం.శివ కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెసిడెన్షియల్ కళాశాలల్లో మన గుత్తి రోడ్డు ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలకు ఎవ్వరికీ రాని విధంగా ఈ సంవత్సరం 470కి 467 మార్కులు, గత సంవత్సరం కూడా ఒక విద్యార్థినికి 470కి 467 మార్కులు వచ్చాయన్నారు. ఈ మార్కులు రావడానికి ప్రధాన కారణం - మా అధ్యాపకులు అద్భుతంగా పాఠాలు బోధిస్తున్నారు. తమ దగ్గర చదువుతున్న ప్రతి అమ్మాయి ఒత్తిడిలో కాకుండా, ఇష్టంతో కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ ఎం.భవాని ఆధ్వర్యంలో ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల, గుత్తి రోడ్డు క్యాంపస్ అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని కొనియాడారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చాలా చాలా అద్భుతంగా ఉన్నాయని, ఈరోజు వారికి మరపురాని, అద్భుతమైన రోజు అని తెలిపారు. ఇంత చక్కగా కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రిన్సిపాల్ భవాని, ఏజీఎం కల్పన, టీచింగ్, నాన్-టీచింగ్ స్టాఫ్‌లను ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు సంతోష్ రెడ్డి, మధుకర్ రెడ్డిలు అభినందనలు తెలిపారు.

అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నా యి. కార్యక్రమంలో అకడమిక్ డీన్ రాధాకృష్ణ,



అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోదీకి 560 మంది విద్యార్థినుల పోస్టల్ కార్డు శుభాకాంక్షలు

## - రామాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం



బుక్కరాయసముద్రం, సెప్టెంబర్ 11 అనంత సూర్య: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని "25 ఏళ్ల ప్రజా సేవా సంకల్పం అభియాన్"లో భాగంగా బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ పి. రామాంజనేయ ప్రసాద్ (సింగనమల ప్రసాద్) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 560 మంది విద్యార్థినులు పోస్టల్ కార్డుల ద్వారా ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మందల శాంత కుమార్, యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట సూర్య ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మోదీ నాయకత్వంలో మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, బేటీ బచావో--బేటీ పడావో, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలతో దేశ అభివృద్ధి, మహిళా సాధికారత, పారిశుధ్యానికి ప్రాధాన్యం పెరిగిందని రామాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. విద్యార్థినులు దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. మందల శాంత కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక సాధికారతకు కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. తోట సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ద్వారా పారిశుధ్యంతో పాటు మహిళల గౌరవానికి ప్రాధాన్యం లభించిందని, విద్యారంగంలో చేపట్టిన చర్యలతో వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి సునీత మాట్లాడుతూ విద్యార్థులతో పోస్టల్ కార్డు కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇటువంటి కార్యక్రమాలు వారిలో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాసు, మండల అధ్యక్షులు ఓబిరెడ్డి, పాఠశాల కన్వీనర్, ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎల్-నినో ప్రభావం ఉంది.. నీటిని జాగ్రత్తగా వాడుకోండి

అనంతపురం, సెప్టెంబర్ 11 అనంత సూర్య : ఎల్-నినో ప్రభావం తీవ్రంగా ఉందని.. రైతులంతా నీటిని పొదుపుగా వాడుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 37మందికి రూ.20.39లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలు, మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరు అనారోగ్య సమస్యలతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా వారిని ఆదుకునే విధంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేస్తున్నట్టు చెప్పారు. ఎవరికి ఎలాంటి కష్టం ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 1472మందికి 11 కోట్ల 21 లక్షల రూపాయలు సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేశామని.. ఎల్ఓసీ కింద 45 లక్షలు ఇచ్చామన్నారు. ప్రమాద బీమా కింద 16 మందికి 77 లక్షలు మంజూరైందన్నారు. ఇలా మొత్తం 12 కోట్ల 43 లక్షలు ఇచ్చినట్టు చెప్పారు. నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. మనం చేస్తున్న ఈ సాయాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులపై



ఉందని ఎమ్మెల్యే సునీత సూచించారు...

## ప్రజా సమస్యలపై జవాబుదారీగా ఉన్నాం.. ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజా సమస్యలపై జవాబుదారిగా పని చేస్తున్నామని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే సునీతకు వివరించారు. వారితో ఓపిగ్గా మాట్లాడుతూ అర్జీలు స్వీకరించారు. కొన్నింటిపై అధికారులతో ఫోన్ మాట్లాడి.. ఎందుకు సమస్యలు పెండింగ్ లో ఉంచారని ఆరా తీశారు. మరికొన్నింటికి వెంటనే పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ప్రజా దర్బార్ లో ప్రధానంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు ఇవ్వడం జరిగింది. అలాగే ఖాళీగా ఉన్న స్థానాలలో వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలను నియమించాలని, చెరువులకు నీళ్లు ఇవ్వాలని అడగడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకుంటోందన్నారు. ప్రతి వారం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. భూసమస్యల విషయంలో ఎప్పటికప్పుడు రెవెన్యూ అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అయితే అన్నదమ్ములు, రస్తాలు, పక్కపక్క పొలాల మధ్య ఉన్న వాటిలో పరస్పరం రాజీ ధోరణితో వెళ్తేనే పరిష్కారం ఉంటుందన్నారు. పింఛన్లు కూడా త్వరలోనే అర్హులందరికీ అందిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో కూడా త్వరలోనే ఒక నిర్ణయం ఉంటుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు. మరోవైపు ఎల్-నినో ప్రభావం చాలా తీవ్రంగా ఉందని.. ప్రస్తుతం కొన్ని చోట్ల చెరువుల్లోనూ, బోర్లలో నీరు ఉందని వరి వంటి పంటలు పెడితే భవిష్యత్ లో నీరు అడుగంటిపోతే ఇబ్బందులు పడుతారన్నారు. ఇప్పుడు ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గానికి నీరు విడుదల చేయాలని అధికారులను ఐఏబీ సమావేశంలో కోరినట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405